# మంచి మనసు

రచన: శ్రీ కలగర్ల నీలకంఠేశ్వరరావు

'అమ్మా వాసవీ! కాస్త ఇలా వచ్చి ఈ రెండు గ్లాసులూ తోమిపెట్టు తల్లి,' అంటూ వంటిట్లోంచి కేక వేసింది రాజేశ్వరమ్మ.

టేబులుముందు కుర్చీ వేసుకూర్చొని ప్రోబ్లెమ్ సాల్వ్ చెయ్యడానికి ప్రయత్నిస్తున్న వాసవికి తల్లిమాటలు చిరాకెత్తించాయి.

'కాస్త వుండమ్మా, ఇలాంటి సమయాల్లోనే నీకు నా సహాయం కావాలి. తీరుబడిగా వున్నప్పుడేమీ వద్దంటావు. తెల్లవారితే పరీక్ష. ఆ గ్లాసుల్ని అలావుంచు తరువాతవచ్చి ఆ పని చూస్తాను.' అంటూ తిరిగి తన పనిలో మునిగిపోయింది వాసవి.

వాసవి ఎంత ప్రయత్నించినా ఆ ప్రోబ్లెమ్ సాల్వ్ కావటంలేదు. తెల్లవారితే పరీక్ష చాలా ముఖ్యమైన ప్రోబ్లెమ్, రేపటి పరీక్షగూడ ఆఖరిపరీక్ష అది దాటితే తను గట్టెక్కినట్లే ఇది తనుపరీక్షకి వెళ్ళటం నాలుగవ సారి లేకపోతే తనీపాటికి మొదటి సంవత్సరం మెడిసన్‌లో వుండేది. 'మనిషికి ఎంతేనా గర్వం పనికిరాదు.' అనుకుంది వాసవి. తను ఆ గర్వంతోనె ఇలా అయింది. 6 వ ఫారం పాసయి కాలేజీలో అడుగుపెట్టిన వాసవికి అంతా అయోమయంగా కనిపించింది. పెద్ద పెద్ద బిల్డింగులూ, అన్నీ ఇంగ్లీషులో నున్న పాఠాలూ, మంచి నీళ్ళలా ఇంగ్లీషు మాట్లాడే స్టూడెంట్సు వీటన్నిటిమధ్య ఎలా వుండాలో అనుకుంది వాసవి. కానీ కాలేజీకి వచ్చి కాలేజీ విద్యార్థినిగా తయారయ్యానన్న సంతోషం, వాసవిని ఆ వాతావరణానికి అలవాటు చేసింది.

విసుగుతో పెన్నుక్రింద పెట్టి అలారం టైంపీసు చూసింది వాసవి. పదకొండున్నర బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని తన రూపాన్ని అద్దంలో చూసుకుంది. తన రూపాన్ని అందరూ ఎలా మెచ్చుకుంటారో అనుకుంది వాసవి. పైగా తను నలుపు. కాలేజీలో తనకు నల్లటమ్మాయి అన్న పేరు వచ్చింది. తన్ను కాలేజీలో మెచ్చుకొన్నవారు లేరు ఒక్క రాజశేఖరం తప్ప. రాజశేఖరం తలంపుకు రాగానే సంవత్సరం క్రిందటి అనుభవములన్నీ మనస్సులోకి రాసాగేయి.

* * *

పుస్తకములు పట్టుకొని కాలేజీకి బయలుదేరింది వాసవి. తన వీధినుండి మలుపు తిరిగి తిన్నగా మైలుదూరంలో నడితే వస్తుంది కాలేజీ. తనవీధినుండి మలుపు తిరిగిన వాసవికి రోజులాగే నల్లటబ్బాయి పుస్తకాలతో కనిపించలేదు. వాసవి రోజూ ఆ స్థలానికి వచ్చేసరికి కాలేజీనుండి తిరిగివస్తూ ఆ నల్లటబ్బాయి కనిపించేవాడు. ఒకనాడు క్రొత్తగా ఆ అబ్బాయి కనిపించేసరికి అందరిలాగే అతను గూడ తనని ఏదోమాట అని ఏడిపిస్తాడనుకుంది. కానీ అతను తన వేపే చూడనట్టుగా తనను దాటి వెళ్ళిపోయేడు తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది వాసవి.

ఆ రోజునుండి నల్లటబ్బాయి వాసవీ అదే స్థలంలో అదే వేళకి ఎదురెదురుగా కలుస్తుండేవారు. కానీ ఇవేళ కనిపించక పోయేసరికి 'నల్లటబ్బాయికి గానీ జ్వరం వచ్చిందేమో' అనుకుంది వాసవి. అతనికి నల్లటబ్బాయి అని పేరు లేదు. ఆ పేరు వాసవి స్వయంగా పెట్టింది. 'తను అతన్ని నల్లటబ్బాయి అని పిలుస్తుంది. తనుమాత్రం తెల్లగా వుందా? తనూ నలుపే' కాలేజీదగ్గరకు రావటంతో ఆలోచనల్ని ఆపుజేసి గేటువద్దకు వెళ్ళింది.

ఆ గేటుదాటి లోపలికి వెళ్ళటమే ఆడపిల్లలకు బ్రహ్మలడం. ఆ గేటుద్వారా లోపలికి వెళ్లిన ప్రతీ అమ్మాయి ఏదో ఒక మాట అబ్బాయిలచేత తిని వెళ్ళవలసిందే! వాసవి పనీ అంతే అయింది.

'నల్లటమ్మాయిగారు వేగరంగా వచ్చేరే' అది ఒక కంఠం.

'ఇవాళ భోజనం ఆలస్యం కామోసు.'

'పెళ్లికూతురులా బుర్ర వంచేసింది.'

'నడిచే వచ్చిందా అని.'

'వైజాగ్ బ్యూటీ.'

ఇలా మాటల్ని వింటూ గేటునుండి లోనికివచ్చింది వాసవి. 'బ్రూట్స్! నేను వైజాగ్ నుండి వస్తేనేం? రాజమండ్రి వస్తేనేం? క్లాసు లెగ్గొట్టి ఇలా అమ్మాయిల్ని ఏడిపించటం ఏమేనా బావుందా? మీకు చెల్లెళ్లు లేరూ.' వెనక్కు తిరిగి అందామనుకుంది వాసవి. అమ్మో 'ఇంకేమేనా

వుందీ; తగిన సమాధానం వస్తుంది. అసలు తను ఈశాస్త్రానికి రావటమే తప్పు. కర్మం చాలక ఆంధ్రదేశంనుండి ఇక్కడకు వచ్చింది.'

వాసవి క్లాసువద్దకు వచ్చేసరికి అమ్మాయి లంతా ఇంకా ద్వారంవద్దనే వున్నారు. అంటే లెక్చరరు రాలేదన్న మాట. వాసవి మెల్లగా వెళ్ళి వాళ్ళతో పాటు నిలుచుంది. క్లాసులోపల అబ్బాయి లందరూ బిల్డింగు అదిరిపోయేలాగు కేకలు వేస్తున్నారు. క్లాసు ఎదురుగానే కాలేజీ ఫీజు పుచ్చుకొనే కౌంటరు విండో వుంది. ఆఖరు రోజు కావటంవల్ల క్యూ ఎక్కువగా వుంది. వాసవి ఆ క్యూ వేపు చూసింది. ఆఖరులో ఒక చేత్తో పుస్తకాలూ, ఒక చేత్తో ఫీజుపట్టుకొని నిల్చున్న నల్లటబ్బాయి కనిపించేడు. అందుచేతే ఇవాళ అతను కలియలేదు. అనుకుంది వాసవి. లెక్చరరు రావటంతో అమ్మాయి లందరూ లోనికి చొరబడ్డారు.

లెక్చరరు చెబుతున్న పాఠం ఏమీ బుర్రకెక్కటం లేదు వాసవికి. పీరియడు పూర్తయింది. క్లాసునుండి బయటకువచ్చి లైబ్రరీ వేపు దారితీసింది. లైబ్రరీలో నుండి పుస్తకాలు తీసుకొని క్లర్కు వద్దకువచ్చి, 'వీటిని ఎంటర్ చేసికొని ఇవ్వండి' అంది.

క్లర్కు పుస్తకాలు చూసి 'మీవద్ద పెన్‌వుంటే ఇవ్వండి' అన్నాడు.

'నావద్ద పెన్ లేదండీ', అంది వాసవి. ఆ రోజు పెన్ను తేవటం మర్చిపోయింది.

క్లర్కు వెనక్కుతిరిగి 'మిష్టర్ మీవద్ద పెన్ వుంటే ఒక్కసారి ఇలా ఇవ్వండి.' అన్నాడు.

వాసవి ఆవేపుచూసింది. అక్కడ కుర్చీలో కూర్చొని పుస్తకం చదువుతున్న నల్లటబ్బాయి తన పేంటుజేబులోంచి పెన్ తీసి క్లర్కు కిచ్చేడు.

క్లర్కు పుస్తకాల నెంబర్లు తీసుకొని ఎంటర్ చేస్తున్నారు. వాసవి నల్లటబ్బాయి వేపు చూసింది. పుస్తకం చేత్తో పట్టుకొని కుర్చీలో నిండుగా కూర్చొనివున్నాడు. పైన తిరుగుతున్న ఫేను గాలికి వంకలు తిరిగిన అతనిజుత్తు అతని నుదుటి పైబడి ఎంతో అందాన్ని ఇచ్చింది.

'సంతకం పెట్టండి' అన్న క్లర్కు మాటలు విని వాసవి సంతకం చేయటానికి పెన్ను తీసికొని చూసింది. నల్లగా వున్న హైలెట్ పెన్నుతో సంతకం చేసింది. సిరాగూడ నలుపే నల్లరంగంటే అతని కిష్టం కాబోలు, అందుకే తనుకూడ నల్లగా వున్నాడు అనుకుంది.

'అరే! అతను పెన్ వదిలేసి వెళ్ళిపోతున్నాడు. మీరు కూడ అలాగే వెడతారులా వుంది. ఆ పెన్ను అతనికిచ్చివేయండి' అన్నాడు లైబ్రరీ క్లర్కు.

వాసవి నల్లటబ్బాయి కూర్చున్న కుర్చీవేపు చూసింది 'అరే ఎంతలో వెళ్ళిపోయేడు.' అనుకుంది.

లైబ్రరీ బయటకు వెళ్ళిచూసింది వాసవి. మెల్లగా అడుగులు వేస్తు వెళ్తున్న అతను కనిపించేడు ఇప్పుడెలా తను అతని దగ్గరకు వెళ్ళి ఇవ్వటమా? వద్దా అని ఆలోచించి దగ్గిరగా వెళ్ళి 'మిష్టర్!' అని పిలిచింది.

అతను ఆగి వెనక్కుతిరిగి ఆశ్చర్యపోయేడు.

'మీరేనా నన్ను పిలచింది' గంభీరమైన కంఠంతో అడిగేడు.

'ఔను మీరు పెన్ వదిలేసారు.' అంటూ పెన్ ఇచ్చింది వణుకుతున్న చేతులో.

'థేంక్స్' అంటూ తీసికున్నాడు.

'అదేమిటండీ పెన్ను ఇచ్చినందుకు మీకు నేను థేంక్స్ చెప్పాలి.' అంది వాసవి.

అతను నవ్వేడు. అందమైన అతని ముఖం మరింత అందంగా కనిపించింది.

'వస్తానండీ' క్లాసుకు వెళ్ళాలి అంటూ వెళ్ళిపోయేడు. వెలుతురు పోయి చీకటి వ్యాపించినట్లయింది. భారంగా అడుగులువేస్తూ కామన్ రూము వేపు వెళ్ళింది వాసవి.

మర్నాడు మామూలుగానే ఇద్దరూ కలుసుకున్నారు. వాసవిని చూసి తెలయనట్లే నటించేడు. కానీ వాసవి అతన్ని చూసి చిరునవ్వు నవ్వింది అతనూ నవ్వేడు.

'క్లాసులన్నీ పూర్తి అయిపోయాయా?' ఒక కాలేజీ అమ్మాయి తనతో అంత చనువుగా మాట్లాట్టం చూసి అతను ఆశ్చర్యపోయేడు.

'ఔనండి మాకు మార్నింగ్ క్లాసులు' అన్నాడు.

'ఓ! అయితే మీరు కామర్సు అన్నమాట,' అంది.

'అన్నమాటే.' అన్నాడు.

వాసవి పకపకమని నవ్వింది.

'అదేమిటి అలా నవ్వుతారు.'

'మీ చమత్కారపు మాటలకి' అంది వాసవి,

'సారీ! మీరేం చదువుతున్నారు.' అని అడిగేడు,

'ఫస్ట్ ఇయర్ బి. ఎస్. సి.

'డాక్టరమ్మగా రవుదామన్న ఉద్దేశమన్న మాట'

'అన్నమాటే.' అంది వాసవి.

'భలేవారే మాటకు మాట బదులిచ్చేరు.' అన్నాడు.

వాసవి చేతి వాచీ చూసుకొని 'అరే పదిగంటలు దాటిపోయింది. వెళ్ళి వస్తాను.' అంది.

'ఓ. కె' అన్నాడు.

ఇద్దరూ చెరోవేపుగా వెళ్లిపోయేరు.

వాసవి క్లాసువద్దకు వచ్చింది పదిగంటల పదినిముషాలైంది. క్లాసులోకి వెళ్ళి కూర్చుంది. లెక్చరరు బోర్డు మీద రాస్తున్న అక్షరాలేవీ కనపడ్డంలేదు. అతని రూపమే కనిపిస్తుంది. పీరియడు పూర్తయిన తరువాత, వాసవి స్నేహితురాలు కమలవచ్చి 'వాసవీ! సాయంకాలం అందరం పార్కుకు వెడదామనుకుంటున్నాము వస్తావా?' అని అడిగింది.

'తప్పకుండా, సాయంకాలం ఆయిదు గంటలకల్లా వస్తాను మీ ఇంటికి' అంది వాసవి.

సాయంకాలమైంది. అపర రతీదేవిలా అలంకరించుకున్న వాసవి గుమ్మం దిగి రోడ్డుమీద నడవసాగింది. వాసవి నలుపైనా ముఖంలో లక్ష్మీదేవి కళ ఉట్టిపడుతుంది. గుండ్రని చక్రములలాంటి కళ్ళు, అంతకన్నా గుండ్రని ముఖం, సంపెగ పూవువంటి ముక్కు విశాలమైన ఆమె పాలభాగం మధ్యన గుండ్రని చిన్న బొట్టు, చెవులకు సన్నని బంగారు రింగులు, ఆమె ముఖం చూసిన వారు ఆమె నలుపన్న విషయమే మర్చిపోతారు.

వాసవి కమల ఇంటివద్దకు వచ్చేసరికి అప్పటికే తన స్నేహితురాళ్ళందరూ తనకోసం కాచుకున్నారు.

సారీ! నావల్ల ఆలస్యం అయింది పదండి పోదాం, అంది వాసవి.

అందరూ కలసి పార్కుకు వచ్చేరు. చల్లనిగాలి, కాంతివంతమైన లైట్లు, రేడియోనుండి రఫీ పాడుతున్న 'తేరే, మేరే. సప్నే' అన్నమాట పార్కుకు మరింత అందాన్నిచ్చాయి.

'రింగ్ ఆట ఆడుకుందామా?' అంది కమల.

'ఓ' అంటూ స్నేహితురాళ్లంతా రెండు జట్లుగా చీలిపోయేరు.

'సారీ కమలా! నేను ఆడను. యూ కెన్ ప్లే. నేనలా వెళ్లి బొగడ పూవులు కోసికొని వస్తాను.' అంది వాసవి.

'ఓ. కే వెళ్ళు.' అంది కమల.

వాసవి తోట మాలి అనుమతి పొంది పూలుకోయటానికి వెళ్లింది. చెట్టువద్దకు వెళ్లి పూలుకోయసాగింది. ఆ ఆనందంలో చిన్నకూని రాగం ఆమె నోటినుండివచ్చింది.

వెన్నెలలో మల్లియలూ,
మల్లియలో ఘుమ, ఘుమలూ

(తరువాయి 19వ పేజీలో)




పంపులు

మరియు

మోటారులు

'ఎన్. ఎం. ఐ.' పంపులు, మోటారులు అమర్చి మీ పంటలద్వారా అధిక లాభము పొందండి. కొన్ని సంవత్సరాల పరిశోధనా ఫలితమే యీ పరికరములు.

తయారించువారు

నిర్మలా ఇండస్ట్రీస్ : : కోయంబత్తూరు-2

(10వ పేజీ తరువాయి)

ఘుమ, ఘుమలో గుసగుసలూ,

ఏవేవో కోరికలూ.

'ఏమా కోరికలు?' అన్న గొంతు విని పాట ఆపు జేసింది. తిరిగి చూసేసరికి నల్లటబ్బాయి నిల్చొని వున్నాడు.

'అలా చూస్తారేమిటండీ నేను రాజశేఖరాన్ని' అన్నాడు.

'రాఖశేఖరమా?'

సారీ!నాపేరు మీకు చెప్పలేదు గదూ? అది నాపేరు.' అన్నాడు రాఖశేఖరం.

'అలాగా' అంది వాసవి.

'అరే! అలా నిలబడిపోయేరేమిటి? ఇలా రండి ఇక్కడ కూర్చుందాము.' అన్నాడు సిమెంటు బెంచీమీద కూర్చొంటూ.

వాసవి అతని కెదురుగా ఇంకో బెంచీమీద కూర్చొని అతన్ని చూసింది. నీలం రంగు పాంటుపైన, తెల్లని బుష్ షర్టు టక్ చేసికొని, తళ తళా మెరుస్తున్న నల్లని బూట్లు వేసుకున్నాడు అతని మెడచుట్టూ వున్న ఆకుపచ్చని టై గాలికి ఇటూ అటూ కదులుతూ అతని హృదయంతో ఆడుకుంటుంది.

'చూడండీ మీ పేరు చెప్పలేదు.' అన్నాడు. రాజశేఖరం.

సిగ్గుతో తలవంచుకొని తన పేరు చెప్పింది వాసవి.

'చూడండీ. మీ పేరుకన్నా ఇందాక మీరు పాడిన పాట చాలా బావుంది. మరొక్కసారి పాడరూ. ఇక్కడ నిజంగా ఈ వెన్నెల, ఈ పూవులు, ఈ నైట్ క్వీన్ ఘుమ, ఘుమలూ వీటన్నిటిలో కోరిక కలగటం వాస్తవమే, ఈవాతావరణానికి సరిపోయింది మీపాట,' అన్నాడు రాజశేఖరం.

'ఏదీ? మీరుగూడ అలాంటి పాట పాడగూడదూ.' అంది వాసవి.

'అమ్మ బాబోయ్! నేను పాడటమే.'

'అబద్దాలాడకండి మొన్న పాటల పోటీలో ఫస్టు వచ్చింది మీకేగా ప్లీజ్ నాకోసం,' అంది వాసవి ప్రతిమాలుతూ.

'అలాగే కానీ మరేమీ అనుకోవద్దు.' అన్నాడు రాజశేఖరం.

'నెవరో, మీరు పాడండి.'

రాజశేఖరం గొంతు సవరించుకొన్నాడు.

'చల్లని వెన్నెలలో, చక్కనికన్నె సమీపములో.

అందమె నాలో లీనమాయెనే ఆనందమే నాగానమాయెనే' పాట పూర్తిచేసి రాజశేఖరం 'ఎలా వుంది?' అన్నాడు.

'వండర్‌ఫుల్! నా ఫేవరేట్ సాంగ్ మీనోట మ్మట విన్నాను. అచ్చంగా ఘంటసాల లాగ పాడేరు.' అంది వాసవి.

'ఏదో లెండి.' అన్నాడు రాజశేఖరం.

'కానీ మీపాట ఈ వాతావరణానికి సరి తగ్గటులేదే.' అంది వాసవి.

'భలేవారే! ఇక్కడ చల్లని వెన్నెలలేదా?'

'వుంది'

'నా సమీపంలో చక్కని కన్నెపిల్ల గూడా కూర్చొని వుందిగా. ఇక ఆ ఆనందమేనా గానంగా మారింది.' చిరునవ్వుతో రాఖశేఖరం అన్నాడు. సిగ్గుతో వాసవి తలవంచుకొని చిరునవ్వు నవ్వింది.

'అదుగో ఆ సిగ్గుతో నున్నపుడు మీరెంత బావున్నారో తెలుసా?' అన్నాడు రాజశేఖరం.

'ఏమిటీ నన్నంతగా వర్ణించేస్తున్నారు. కొంపదీసి మీరు కవులు గూడా కాదుగదా' అంటూ వాసవి నవ్వింది. నవ్వినపుడు సొట్టలుపడే ఆమె బుగ్గలు, ముత్యాలవంటి పలువరుస రాజశేఖరాన్ని ముగ్ధుణ్ణి గావించేయి.

'మీరు అంత స్వచ్ఛమైన భాషలో మాట్లాడుతున్నారు. మీరు బ్రాహ్మణులై వుంటారు.' అన్నాడు రాజశేఖరం.

'నో, నో మాది ఆర్యవైశ్యకులం' అంగి వాసవి.

'వాట్? మీరు ఆర్యవైశ్యులా?' ఆశ్చర్యంతో ప్రశ్నించేడు రాజశేఖరం.

'అవును. ఏం అలా ఆశ్చర్యపోతారు'

'మరేం లేదు మేం గూడా ఆర్యవైశ్యులమే'

వాసవికి ఆనందంతో నోటమాట రాలేదు. ఆమె వేడెక్కిన హృదయంతో చల్లని పన్నీరు చిలికినట్లయింది. మెల్లగా గొంతు సవరించుకొని 'నిజంగానా' అంది.

'ఇందులో అబద్ధమాడవల్సిన పనేముందీ.'అన్నాడు. రాజశేఖరం చేతివాచీ చూసుకొని, సానిరీ ది ఎనిమి

గంటలైంది. హోటలుకు పోయి, భోజనం చేయాలి వస్తాను.' అంటూ లేచాడు.

'గుడ్ నైట్!' అంది వాసవి.

'వెరీ వెరీ గుడ్ నైట్' అంటూ వెళ్ళిపోయేడు రాజశేఖరం.

'వాసవీ ఇక్కడేం చేస్తున్నావు. పూలుకోస్తానన్నావు ఏవీ.' అంటూ కమల వచ్చింది.

'కమలా నువ్వా ఆ! నేను పువ్వులు కోయలేదు.' అంది వాసవి.

'ఇంత సేపూ ఏంచేస్తున్నావు ఇక్కడ?' ప్రశ్నించింది కమల.

'నేనా? నేనా? నేనూ... నేనూ... ఊరక నే కూర్చున్నాను' తడబడుతూ చెప్పింది వాసవి.

'భలేదానివే అలా వణికిపోతావెందుకు పద ఇంటికి పోదాం. ఇప్పటికే ఎనిమిది గంటలైంది' అంది కమల.

వాసవి ఇంటికి వచ్చేసరికి ఎనిమిదిన్నర గంటలైంది. గుమ్మంలోనే ఎదురైన తల్లి 'వాసవీ ఎక్కడికెళ్లావమ్మా' అని ప్రశ్నించింది.

'అలా పార్కుకు వెళ్ళివచ్చానమ్మా' అంది వాసవి.

'చూడమ్మా నీ బలవంతంవల్ల నువ్వేదో డాక్టరు చదువుతానంటే నాన్నగారు ఒప్పుకున్నారు లేకపోతే ఈ పాటికి నీకు వివాహం చేసేవాళ్లం వయస్సువచ్చిన అమ్మాయివి, ఇలా రాత్రిదాకా ఇల్లు వదలి వుండటం మంచిది కాదు. పైగా మన కులంలోని అమ్మాయిలు ఇలా పార్కులకూ, సినీమాలకు ఒంటరిగా వెళ్ళరు తల్లీ' అంది రాజేశ్వరమ్మ.

'ఏమిటమ్మా! ఏదో పాతకాలపు కబుర్లు చెబుతావు' అంది వాసవి.

'సరేలే నే చెప్పేవేమీ బోధపడవు, పరీక్షలు దగ్గర కొస్తున్నాయి. మెడిసన్‌లో సీటు రావాలంటే క్లాసు రావాలి. జాగ్రత్తగా చదువు పద. భోజనం చేయవుగాని' అంది రాజేశ్వరమ్మ.

భోజనంచేసి మంచంమీద పడుకుంది వాసవి. 'తన బలవంతంమీదే తనను ఇంకా చదివిస్తున్నారా, అమ్మా నాన్నా? లేకపోతే వివాహం చేసేవారా? తనకు వివాహమా? ఏం తను స్త్రీ గాదా? ఏనాటికేనా ఒక పురుషుణ్ణి వివాహం చేసికొని సంసారం చేయవలసిందే. తను ఎవర్ని వివాహం చేసికోవాలి రాజశేఖరాన్నా? రాజశేఖరం అంటే తనకెందుకంత అభిమానం? తను ప్రేమిస్తుందా అతన్ని? ఏమో అతనుగూడ తన్ను ప్రేమిస్తున్నాడా? 'అతనికీ తనకు వివాహం అయితే' తన ఆలోచనలకు నవ్వుకుంది వాసవి. నిద్రపోవటానికి ప్రయత్నించింది ఆ తీయని ఆలోచనల్ని మరొకసారి నెమరు వేసుకుంటేనేగాని ఆమెకు నిద్ర రాలేదు.

* * *

'వాసవీ! ఇవాళ మనం క్లాసుకు వెళ్ళవద్దు నీకో ముఖ్య విషయం చెప్పాలి' అంది కమల వాసవితో ఆ మర్నాడు కాలేజీలో.

'ఏమిటి కమలా?' అంది వాసవి.

'పద అలా.' గర్ల్స్ కామన్ రూమువైపు దారితీసేరు వాసవీ, కమల.

గర్ల్స్ కామన్ రూములో ఎవ్వరూలేని ఏకాంత స్థలంలో కూర్చున్నాక కమల తన పుస్తకంలోనుండి ఒక ఉత్తరం తీసి 'వాసవీ! దీన్ని చదువు' అంది.

వాసవి దాన్నితీసి చదువ సాగింది.

కమలా! నా హృదయరాణీ!

నీవు లేనిదే నాకీ లోకంలో బ్రతుకులేదు. నీ సున్నితమైన శరీరంతో ఆడుకోవాలని నాకుంది. కమలా! నీ మెత్తని...

ఇక చదవలేకపోయింది వాసవి. 'చీ! ఎవరు రాసేరీ ఉత్తరం,' అంది.

'క్రింద సంతకం చూడు నీకే తెలుస్తుంది.' అంది కమల. క్రింద సంతకం చూసింది వాసవి. గుండె ఆగిపోయినంత పనైంది. అక్కడ 'రాజశేఖరం' అన్న సంతకం వుంది. 'ఇంత నీచుడా రాజశేఖరం తనవద్ద ఎంత మంచిగా ప్రవర్తించేడు. ఇటువంటి గోముఖవ్యాఘ్రం నోటిలో పడకుండా తను రక్షించుకోగలిగింది. తనెంతో అదృష్టవంతురాలు. రాజశేఖరం ఇలా ఎందరి ఆడపిల్లల హృదయాలతో ఆడుకుంటున్నాడో.' అనుకుంది.

'ఏమిటి వాసవీ ఆలోచిస్తున్నావు,' అంది కమల.

'ఏమీ లేదు రాజశేఖరమే ఈ ఉత్తరం రాసేడంటావా.'

(సశేషం)


# కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

[స్థాపితము 1938]

విడి ప్రతి ... 25 పై.

సంవత్సర చందా ... రూ 5-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాథమ్స్, స్వదేశమిత్రన్ బుక్ స్టాల్సులోనూ దొరకును.